www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 ఫిబ్రవరి 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

న్యాయం జరిగేలా చూస్తా

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: నెల్లూరు రూరల్ నియోజక ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డిని నెల్లూరు మెప్మా సిబ్బంది శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో కలిసి తెలంగాణ ప్రభుత్వం మెప్మా సిబ్బందికి ఏ విధంగా పేస్కేలను ఇంప్లిమెంట్ చేస్తుందో అదేవిధంగా ఏపిలోని సిబ్బందికి కూడా వర్తింప చేయాలని కోరారు. పై డిమాండ్‌కు స్పందించిన ఎంపి తప్పక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మీకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్శిగుంట పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి షాకీర్, జిల్లా కోశాధికారి కాంతయ్య, జాయింట్ సెక్రటరీ సుధాకర్, జరీనా, అంకయ్య, కామక్షయ్య పాల్గొన్నారు.

వైసిపి స్పీడ్ పెంచిందా..!

ప్రభుత్వం ఒక్కసారిగా స్పీడ్ పెంచింది. ఎన్నికల వేళ సామ,దాన, భేద, దండోపాయాలు ప్రయోగిస్తుంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న విషయం తెలిసిందే. నిన్న, మొన్నటి వరకు మంచి ఊపు మీదున్న టిడిపి కాస్త వెనుకపడినట్లు కనిపిస్తోంది. వైసిపి కార్యక్రమాలు వేగ వంతం చేసింది. అభ్యర్థుల ఎంపిక, నూతన నాయకత్వం ఏర్పాట్లు, విభేదాలను చక్కబెట్టే పనిలో బిజీబిజీగా ఉంది. ప్రభుత్వ నుంచి పెద్దఎత్తున పథకాలు అమలు చేస్తున్నారు. నిధులు వరదలా పారిస్తున్నారు. అన్ని పథకాలకు సంబంధించిన నిధులు అంజేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో సమీకరణాలు చేసి, మళ్లీ జగన్ వస్తేనే పథకాలు అమలు చేస్తారని, లేదంటే అవి నిలిచి పోయతాయని ప్రచారం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఉత్సాహంగా కనిపించిన టిడిపి, ఇప్పుడు పొత్తులు, సర్దుబాట్లు, సమస్యలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కనిపిస్తోంది.

ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. ఈ నెలాఖరుకు ఎన్నికల షెడ్యూల్ వస్తుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార వైసిపి ఒక్కసారిగా స్పీడ్ పెంచింది. జిల్లాలోని పార్టీ అభ్యర్థుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. తమకు అత్యంత సన్నిహితులు నెల్లూరు ఎంఎల్ఎ పి. అనిల్‌కుమార్‌యాదవ్‌ను నర్సారావుపేట ఎంపి అభ్యర్థిగా పంపారు. పార్టీలో అనిల్ ఇబ్బందులు రాకుండా చూసుకున్నారు. ఉదయగిరిలో మేకపాటి రాజారెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇక్కడ అసమ్మతితో ఉన్న ఐదురుగు వైసిపి నేతలను ఆపార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమస్యలను పరిష్కరించినట్లు తెలుస్తోంది. కావలి అభ్యర్థి విషయంలోనూ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఉంటారని సూచాయంగా తెలిపినట్లు సమాచారం. ఎంపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించారు. నెల్లూరు నగర టికెట్ ఎవరికి ఇస్తారనే సందిగ్ధత నెలకొంది. సీటు విషయంలో ఇబ్బందులు, విమర్శలు లేకుండా పార్టీ అధిష్ఠానం చాకచక్యంగా వ్యవహరిస్తుంది. పార్టీ విషయాలను పక్కన పెట్టి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున పథకాలు అమలు చేస్తుంది. ఏ క్షణమైనా ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉన్నందుకు ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన పథకాలు అమలు చేస్తున్నారు. ఓటర్లుగా మార్చుకునే ఆలోచన చేస్తున్నారు. జగనన్న ఇళ్లు నెల్లూరు, ఇతర ప్రాంతాల్లో త్వరగా ఇవ్వాలని చూస్తున్నారు. కేవలం 20 శాతం మాత్రమే ఇళ్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అనేక చోట్ల పునాదులుగానే మిగిలి పోయాయి. ఇది పార్టీకి పెద్దగా ప్రయోజనం చేకూరేలా కనిపించడం లేదు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, పెన్షన్, ఆరోగ్య శ్రీ, వంటి పథకాలు వరకట అమలు చేస్తున్నారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 34,443 పొదుపు సంఘాలకు 3,29,846 మంది సభ్యులకు రూ.270 కోట్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆపార్టీ నేతలు సమావేశాలు ఏర్పాటు చేసి, జగన్ మళ్లీ రాకపోతే ఈ పథకాలు ఉండవని పేర్కొంటున్నారు. పెన్షన్ ప్రతి నెల 3,18,980 మందికి రూ.95 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం కింద ఒక్కో మహిళకు రూ.18,500 చొప్పున రూ.150 కోట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు రావాల్సిన నగదు ఇస్తున్నారు. ప్రజలను ఓటర్లుగా మార్చుకునే పనిలో ఉన్నారు. పార్టీపరంగా, ప్రభుత్వ పరంగా వైసిపి స్పీడ్‌గా ఉంది.

..ప్రభుత్వం ద్వారా భారీగా నిధులు
..పార్టీ సోషల్ మీడియా హల్‌చల్
..పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు దాదాపు ఖరారు
..టిడిపి, జనసేన సమన్వయ లోపం

టిడిపి, జనసేన సమన్వయలోపం..!

ప్రభుత్వంపై ప్రజల్లోని వ్యతిరేకతను ప్రచారం చేసిన ప్రతిపక్ష టిడిపి ఎన్నికల సమయానికి నత్తనడక నడుస్తోంది. టిడిపి, జనసేన సమన్వయ సమస్య కనిపిస్తోంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆచీతూచి అడుగు లేస్తున్నారు. కావలి, ఉదయగిరి, నెల్లూరు సిటీ, వెంకటగిరి, సూళ్లూరుపేట, కోవూరు, ఆత్మకూరు, నియోజకవర్గాల్లో ఎటూ తేల్చడం లేదు. టిడిపిలోనే ఇద్దరు ముగ్గురు నేతలు నాకంటే నాకు అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు జనసేన నేతలు వ్యవహరిస్తున్నారు. నెల్లూరు సిటీ నుంచి మాజీ మంత్రి పి.నారాయణ ప్రచారం చేసుకుంటున్నారు. మరో వైపు జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంతిరెడ్డి నేను ఉన్నానంటూ ప్రచారం చేస్తున్నారు. తాజాగా సినీ కొరియో గ్రాఫర్ జానీ మాస్టర్ పవన్‌కళ్యాణ్‌ను కలిసి, నగరంలో కలియతిరుగుతున్నారు. ఏం మాట్లాడితే ఏం జరుగుతుందోనని భయంతో టిడిపి నేతలు ఎవరూ నోరు మెదపడం లేదు. ఎన్నికల సమయానికి టిడిపి కాస్త స్పీడ్ తగ్గినట్లు కనిపిస్తోంది. వచ్చే అదునును ఆవిష్కరించిన అధికార వైసిపి కాస్త స్పీడ్ పెంచినట్లు కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి.


సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసిన ఎండి ఖలీల్, పక్కన నెల్లూరు సిటీ ఎంఎల్ఎ అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు వైసిపి అభ్యర్థి ఎండి ఖలీల్
పంతం నెగ్గించుకున్న అనిల్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు సిటీ వైసిపి అభ్యర్థిగా నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎండి ఖలీల్‌ను ప్రకటించింది. కొద్దిరోజులుగా తీవ్ర ఉత్కంఠంలో ఉన్న టికెట్ విషయంలో మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తమ పంతం నెగ్గించుకున్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసాపురం ఎంపి అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సీటుకు వేమిరెడ్డి ప్రశాంతరెడ్డి, ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి పేర్లు ముందుకొచ్చాయి. వీరికి ఇస్తే నియోజకవర్గంలో తన పట్టు కోల్పోతామని గ్రహించిన అనిల్ వ్యూహరచన చేశారు. తన ముఖ్య అనుచరుడు తను చెప్పినట్టు వినే ఖలీల్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. శుక్రవారం అనిల్‌ను తన వెంట రాజధానికి తీసుకెళ్లారు. దగ్గరుండి సిఎంకు పరిచయం చేసి సాయంత్రానికి ఎవరికీ ఊహకు అందని విధంగా ఖలీల్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.

ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి నూతన ఎంపీడీఓగా ఏవి సుబ్బారావు విధుల్లో శుక్రవారం చేరారు. బోగోలు బిట్రగుంట నుంచి గుడ్లూరుకి బదిలీ చేయడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని విధుల్లో చేరినట్టు తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం
8న చలో విజయవాడ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్లు, కార్యదర్శి అన్నపూర్ణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆశా వర్కర్స్ ప్రధాన సమస్యలైన కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ (సిఐటియు) పిలుపు మేరకు ఈ నెల 8వ తేదీన 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు అనేక సేవలందిస్తున్నప్పటికీ వేతనం కనీసం రూ. 10 వేలు అందజేయడం లేదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న కొద్ది మొత్తంలో 3 వేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పర్యటించేందుకు, జిల్లా వైద్యశాలలకు తిరిగేందుకు ప్రయాణ ఖర్చులు అవుతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఆశాలకు ప్రభుత్వం అందజేస్తున్న వేతనంతో కుటుంబ పోషణ సజావుగా సాగడం లేదన్నారు. ఈ సమస్యల సాధన కోసం విజయవాడలో మహాధర్నా కార్యక్రమానికి పిలుపు నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆశాలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో ఆశాలుగా విధులు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది ఎఎన్ఎంలుగా శిక్షణ పొంది ఉన్నారని, ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేసే సమయంలో ఆశాలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశాలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆశాలకు మెటర్నిటీ సెలవులు ప్రభుత్వం కేటాయించాలన్నారు. వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని రకరకాల పథకాల పేరుతో బటన్లు నొక్కుకుంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆశాల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే రానున్న ఎన్నికల్లో ఆశాలు సైతం బటన్ నొక్కి వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవీణ, విజయమ్మ, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు సిద్ధం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ: నగర పాలక సంస్థ పరిధిలో దోమల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 5 నూతన హ్యాండ్ హెల్డ్ ఫాగింగ్ మెషిన్లను ఇంజినీరింగ్ విభాగం సిద్ధం చేసి శానిటేషన్ విభాగానికి అందించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో మెషిన్ల పనితీరును కమిషనర్ వికాస్ మర్మత్, శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లార్వా దశలోని దోమలను నివారించేందుకు అన్ని డివిజనుల్లో 54 చేతి స్ప్రేయర్ల ద్వారా మెలాథిన్ మందును పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు. ఎదిగిన దోమల నివారణకై 2 భారీ ఫాగింగ్ మెషిన్ల ద్వారా ప్రణాళికాబద్ధంగా అన్ని డివిజనుల్లో ఇప్పటివరకు ఫాగింగ్ చేయిస్తూ వస్తున్నామన్నారు.వాహనాలు ప్రవేశించలేని చిన్న వీధులు, సందులలో, భవనాల్లో ఫాగింగ్ చేసేందుకు ప్రత్యేకంగా నూతన మెషిన్లు ఉపయోగపడతాయన్నారు. 6 లీటర్ల కెపాసిటీ కల పెట్రోల్ ఆధారిత హ్యాండ్ హెల్డ్ ఫాగింగ్ మెషిన్ ద్వారా మెలాథిన్ మందును డీజల్ తో కలిపి పొగ రూపంలో విడుదల అవుతుందని, గంట సేపటి వరకు ఫాగింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. చిన్నపాటి వాహనంపై ఫాగింగ్ మెషిన్ తో పారిశుధ్య సిబ్బంది ప్రయాణిస్తూ అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ దోమల నివారణా చర్యలు చేయపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఇ.సంపత్ కుమార్, డిఇఇ.సురేష్, ఏ.ఈ చాణక్య, ఫాజిల్, శానిటేషన్ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫాగింగ్ స్ప్రే చేస్తున్న సిబ్బంది

బహిరంగ వేలం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండల పరిధిలోని మాలకొండ పుణ్యక్షేత్రంలో కొలువుతీరి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో తలనీలాల నిర్వహణ కొన్ని దుకాణాల హక్కుల కోసం జరిగిన బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొన్నిటికీ హక్కులు లభించాయని కొన్ని వాయిదా పడినట్లు దేవస్థానం పర్యవేక్షణ అధికారి కె. బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలనీలాలు వాయిదా పడినట్లు తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కు నిర్వహించిన వేలంపాట వాయిదా పడినట్లు పేర్కొన్నారు. నెయ్యి, పాలు పొందేందుకు 89 వేల రూపాయలకు వేలంపాటలో హక్కులు లభించినట్లు తెలిపారు. వాహన పార్కింగ్ రుసుం వసూలు హక్కుల పరిధిలో జరిగిన వేలంపాట వాయిదా పడినట్లు తెలిపారు. చీరలు జాకెట్లు వసూలు ఆకు కోసం జరిగిన వేలం పాట వాయిదా పడినట్లు తెలిపారు. కొబ్బరికాయల దుకాణ నిర్వహణ వేలం పాట వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అద్దాలు ఫోటోలు పూజ ద్రవ్యములు నిర్వహణ దుకాణ హక్కుల పొందినందుకు జరిగిన వేలంపాట వాయిదా పడినట్లు తెలిపారు. బొమ్మల అంగడి నిర్వహణ హక్కులు వేలంపాట ద్వారా రూ.3,72,000 పలికినట్లు తెలిపారు. రెండవ బొమ్మల అంగడి దుకాణ నిర్వహణకులు 3,21,000 వేల రూపాయలు పలికినట్లు తెలిపారు వాయిదా పడిన అన్నిటికీ బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని ఆలయ అధికారి కె. బి శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి బైరాగి చౌదరి పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్లు..

ప్రజాశక్తి-పొదలకూరు: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల వెలిశాయని, పబ్లిక్ పర్పస్ స్థలాలు కూడా ఆ యజమానులు అమ్మేసుకుంటున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున నాయుడు, టిడిపి నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, అక్కెం సుధాకర్ రెడ్డిలు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల విస్తరణ అధికారి (ఇఒపిఆర్‌డ్డి) నరసింహా రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 52 లేఅవుట్లు ఉన్నాయన్నారు. వీటిలో 32 లేఅవుట్స్ అనధికారికంగా ఉన్నాయన్నారు. ఈ లేఅవుట్ల ద్వారా పంచాయతీకి 17 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో రావాల్సి ఉందన్నారు. వీటిలో ఏ ఒక్క లేఅవుట్ లో కూడా పబ్లిక్ పర్పస్ స్థలాలు లేవని, లే అవుట్ వేసిన యజమానులే పక్క ప్లాట్ల నంబర్లతో స్థలాలు అమ్మేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనధికారిక లే అవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని, కేవలం నోటీసులు ఇచ్చి సరి పెడితే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. మండలంలోని మరుపూరు, బిరదవోలు చాటగొట్ల, చిట్టేపల్లి తిప్పల వద్ద అధికార పార్టీ నాయకులు గత 15 రోజులుగా విచ్చలవిడిగా గ్రావెల్ అమ్మకాలు సాగిస్తుంటే మండల అధికారులు కళ్లు మూసుకొని ఉన్నారా! అని ఎద్దేవా చేశారు. సోషల్ మీడియాలో, పత్రికల్లో కథనాలు వస్తుంటే ఏ ఒక్క అధికారి కూడా స్పందించడం లేదని మామూళ్ల మత్తులో అధికారులు తూలుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.వెంకటేశ్వర్లు నాయుడు, బోగోలు భాస్కర్ రెడ్డి, వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, ఆదాల మురళీ, గంటా మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ముగిసిన సాయుధ బలగాల వార్షిక సమీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం సాయుధ బలగాల వార్షిక సమీకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది వత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణ, నిబద్దతతో విధులు నిర్వర్తించాలని పిలుపు నిచ్చారు. పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలు మరింత పెరిగేలా పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. ఇష్టపూర్వకంగా, సమయానుకూలంగా విధులు నిర్వహిస్తూ, రాబోయే ఎన్నికలు, అన్ని సవాళ్లను ఎదుర్కునేలా సిద్ధంగా ఉండాలన్నారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో ఏ.ఆర్ విభాగం పాత్ర కీలకమన్నారు. ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఈ విధంగా ప్రతి ఒక్కరూ చేయడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్టు టార్గెట్ (లక్ష్యం) వైపే పడుతుందనే నమ్మకం కలుగుతుందన్నారు.యూనిఫామ్ వేసుకున్న తొలిసారి ఉన్న ఉత్సాహం పదవీ విరమణ తదుపరి రోజు వరకూ ఉండాలని ఆకాంక్షించారు. తదిపరి అడిషనల్ ఎస్.పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 రోజుల పాటు జరిగిన వార్షిక సమీకరణలో యోగాకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన అన్ని పున్ఞశ్చరణ తరగతులు నిర్వహించడం జరిగిందని, అత్యాధునిక ఆయుధాలను ఎలా హ్యాండిల్ చేయాలన్నారు. అనంతరం బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న అధికారుల సేవలను కొనియాడి వారికి శాలువాలు కప్పి సత్కరించి, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి, జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పొదలకూరు: పట్టణంలోని అయ్యప్ప నగర్ గేట్ సెంటర్‌లో వెలసివున్న శ్రీదేవీ భూదేవీ సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి మొదటి వార్షికోత్సవ వేడుకలు ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం దేవస్థాన కమిటీ సభ్యులు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిను మంత్రి క్యాంప్ కార్యాలయం లో కలిసి, ఆయన ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వార్షికోత్సవ వేడుకలకు మంత్రిని సగౌరవంగా ఆహ్వానించారు.కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ బోయిళ్ల మాలకొండా రెడ్డి, కమిటీ సభ్యులు వాకాటి శ్రీనివాసులు రెడ్డి, అల్లూరు రమణయ్య, చాట్ల కోటేశ్వరరావు, గోగుల మోహన్ రావు, చిట్లూరు సుబ్రమణ్యం, కండే వాసు, సంకల శ్రీనివాసులు, ముద్దు బాబు, వినోద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలువాయి

మండల కేంద్రమైన.కలువాయి గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక కలువాయి టిడిపి కార్యకర్త బొలిగర్ల చెన్నయ్య గుండెపోటుతో మృతి చెందాడు. నిజం గెలవాలి పరామర్శలు భాగంగా మతుడు చెన్నయ్య కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి ధైర్యం చెప్పారు. చెన్నయ్య కుటుంబానికి మూడు లక్షల రూపాయల చెక్కును ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా భువనేశ్వరి అందరికి అభివాదం చేశారు. మహిళ లను పలకరిస్తూ వెళ్లారు.ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి పన బాక లక్ష్మి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొలిగర్ల మస్తాన్ యాదవ్‌లు నారా భువనేశ్వర్‌కి ఘన స్వాగతం పలికారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు: 55వ ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరులో ప్రకాశం పంతులు రోడ్డులోని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు విగ్రహానికి ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పూలమాలవేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళీమోహన్ మాట్లా డారు. రాజకీయ పార్టీల నాయ కులు పాల్గొని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పి ంచారు.

కార్యక్రమం లో చక్కా వెంకట కేశవరావు, జనా ర్దన స్వామి, ఆలయ ఛైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఆర్ వెంకటేశ్వర్లు, కాకర్ల రాజగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల వయోపరిమితి 46 సంవత్సరాలకు పెంచాలి

ప్రజాశక్తి-నెల్లూరు

డిఎస్‌సి 2024 లో అభ్యర్థుల వయోపరిమితి 46 సంవత్సరాలకు పెంచాలని ఉపాధ్యాయ సంఘం బిటిఏ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గత 5సంవత్సరాల నుంచి ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం కారణంగా నిరుద్యోగ యువత తీవ్రం గా నష్టపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించే డిఎస్‌సి 2024లో అర్హత వయస్సు 42 పెడితే దీర్ఘకాలంగా డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

5సంవత్సరాల తరువాత వేస్తున్న డీఎస్సీ కాబట్టి , అందరికీ న్యాయం జరిగే విధంగా అర్హత వయస్సును 46 సంవత్సరాలకు పెంచాలని, నిరుద్యోగ యువత కు న్యాయం చేయాలని,బిటిఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మణి సుబ్బు, మాస ప్రసాద్ లు ఒక ప్రకటన లో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రం లో 25వేలకు పైచిలుకు ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే 6వేలు మాత్రమే భర్తీ చేయడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం కంటి తుడుపు డిఎస్‌సి కాకుండా 25వేల ఖాళీలతో మెగా డిఎస్‌సి వేసి చిత్త శుద్ధి నిరూపించు కోవాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్లో విద్యారంగానికి అన్యాయం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్ మొత్తం అబద్ధాలతో కూడి, విద్యారంగానికి తీరని అన్యాయం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మెండా.శ్రీహర్ష విమర్శించారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ రామచంద్రా రెడ్డి భవన్ లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో దేశ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వాస్తవాలకు బహుదూరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యారంగంలో 28 శాతం విద్యార్థినుల ఎన్రోల్మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజినీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా ఉందన్నారు. ప్రపంచంలోనే ఇది అత్యుత్తమమైందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిజెపి అధికారం చేపట్టాక విద్యార్థినులు చదువులకు దూరమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ పాఠశాలలు, నవోదయల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. స్కిల్ ఇండియా ఏర్పాటు చేసి ఒకటి పాయింట్ ఎనిమిది కోట్ల మంది యువతను స్కిల్డ్ యువతగా తీర్చిదిద్దామనని తెలిపారు. ఎన్ని లక్షల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షులు వి.నరేంద్ర మాట్లాడుతూ నూతన ఐటిఐలు, ఐఐటీలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎంలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెప్పారుగానీ, ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. ప్రభుత్వమే 390కి పైగా ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతులిచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందన్నారు. ఏకలవ్య పాఠశాలలు, సైనిక స్కూల్స్ తదితర ఏర్పాటు చేసినట్లు చెప్పినా దేశంలో నూతన విద్యాసంస్థలు ఎక్కడా ప్రారంభం కాలేదన్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగానికి ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో విద్యాప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో నగర కార్యదర్శి చరణ్, నగర నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తా

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

నెల్లూరు నగర వైసిపి అధ్యక్షులుగా పార్టీ తనపై పెట్టిన నమ్మకంతో మరింత బాధ్యతతో పార్టీ బలోపేతానికి కషి చేయడం జరుగుతుందని నెల్లూరు నగర వైఎస్ఆర్సిపి నూతన అధ్యక్షులుగా నియమించబడిన రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్స్ ఓనర్స్ అండ్ డీలర్స్ అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి పేర్కొన్నారు. వైసిపి పెద్దలు తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా నిరంతరం పార్టీ అభివద్ధి కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. నెల్లూరు నగర వైసిపి అధ్యక్షులుగా పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు. నెల్లూరు నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రెండు దశాబ్దాల నుంచి తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నానని, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పార్టీ సిటీ అధ్యక్షుడిగా తన పేరును ప్రతిపాదన పంపి ఆమోదం పొందేలా కషి చేశారని తెలిపారు. ఎంపి ఆదాల అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కూడా సిటీ అధ్యక్షులుగా తనను నియమించేందుకు అంగీకరించి ఆమోదముద్ర వేయించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేలూరు శ్రీధర్ రెడ్డి, నగర కువ్వకొల్లు బాబ్జి యాదవ్, లంకా శివరామరెడ్డి, సునీల్ రెడ్డి, స్వర్ణ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ సిడిపిఒ విజయ్ కుమారి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు అమ్మవారిపాలెం రెండు కేంద్రాలు అడివి రాజుపాలెం రెండు కేంద్రాలు ఆర్వి అగ్రహారం ఒక కేంద్రంలో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలిం చారు. చిన్నారుల శాతాన్ని పెంచాలని అంగనవాడీ కార్యకర్తలను ఆదేశించారు.

పలుచోట్ల ఎంపిడిఒల బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అనంతసాగరం : అనంతసాగరం నూతన ఎంపిడిఒగా తాజ్ మాస్రూర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఎంపిడిఒగా పని చేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చారు. నూతన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. మండల పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురం మండల ఎంపిడిఒగా ఎస్.అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఆయన చిత్తూరు నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే గాక మండల పరిషత్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేస్తానన్నారు.

ప్రజాశక్తి-సంగం : ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నూతన ఎంపిడిఒగా పి.శేషగిరిరావు భాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా అధికారులు అన్నమయ్య జిల్లా నుండి ఆయన్ను సంగం ఎంపిడిఒగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా సంతకం చేసి భాద్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేలా కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సమయంలో మండల అభివృద్ధికి గట్టిగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బాబు ఆశీస్సులతో విజయం సాధిస్తా...

మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు ఉంటే నెల్లూరు జిల్లా పార్లమెంటు అభ్యర్థిగా విజయం సాధిస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచల బాబు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తన అతిథి భవనంలో జయహో బిసి గర్జన సభను నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభకు అధ్యక్షత మతకాల శ్రీను నిర్వహించి సమావేశంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభ ముఖ్య ఉద్దేశం టిడిపిలో బిసిలకు వేసిన పెద్దపీటను ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో అందుతున్న దుర్మార్గ అరాచక పాలన వివరించేందుకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. నారా చంద్రబాబును నెల్లూరు జిల్లా పార్లమెంటు పరిధిలో ఏడు అగ్రవర్ణాలు ఉన్నారని పార్లమెంటు అభ్యర్థిగా అధిక ఓట్లు ఉన్న బిసిగా నన్ను ఎంపిక చేయాలని అభ్యర్థించాలని ఆయన ఆశీస్సులు ఉంటే జిల్లాలో బిసిలు తరపున ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడం తమ బాధ్యత అన్నారు. తన తండ్రి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎగా చపరిచితులని ఐదు సంవత్సరాలు జెడ్‌పి చైర్మన్‌గా అవినీతి మరకలు లేని బిసిగా తానేనని గర్వంగా చెప్పుకుంటున్నాని, 2024లో నియోజకవర్గ ఎంఎల్ఎగా మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబును గెలుపిచ్చుకునే బాధ్యత ప్రతి బిసి నాయకులు కార్యకర్తలపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో టిటిడి మూడుసార్లు బిసిలకు ఇచ్చారని వైసిపి ప్రభుత్వం బిసిలపై కపటి ప్రేమ చూపుతూ బిసిలను నమ్మక ద్రోహం చేస్తుందని 2024లో వచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని ప్రతి బిసి కార్యకర్త గుర్తించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం రాష్ట్ర జిల్లా బిసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పుడు నుండి బిసిలపై జరుగుతున్న అన్యాయాలు అక్రమ అరెస్టులు ఎదుర్కోనాలంటే బిసిలకు అండగా నిలబడే తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలన్నారు. 5వేల కేసులు కార్యకర్తలపై వైసిపి ప్రభుత్వం పెట్టిందని పాల్గొని అనేక విధాలుగా సంఘటనలన్నింటినీ గుర్తుంచుకోవాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 30వేల పథకాలను తీసుకొస్తే జగన్ వాటిని రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు రియాజ్, నియోజకవర్గ బిసి నాయకులు రవీంద్రబాబు, శ్రీనివాసులు, సుభాన్ బాషా, హరికృష్ణ, భాస్కర్, వాసు, రేవతి, నరసింహారాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో నిర్వహణకు ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు మార్చి 3వ తేదీన నిర్వహించ తలపెట్టిన పల్స్‌పోలియో కార్యక్రమ లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకో వాలని ప్రోగ్రాం అధికారులకు, వైద్యాధికారులకు,ఆరోగ్య పర్యవేక్షకులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య సూచనలు చేశారు. శుక్రవారం నగరంలోని డిఎంఅండ్ హెచ్ఒ కార్యాలయ సమావేశ మందిరంలో నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్లలోని ప్రోగ్రాం అధికారులతో, వైద్యాధికారులతో, ఆరోగ్య పర్యవేక్షకులతో వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్ (విపిడి) కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిఎల్ఎటిఒ డాక్టరు ఎస్‌కె ఖాదర్‌వలీ మాట్లాడుతూ బిసిజి వ్యాక్సినేషన్ విజయవంతం చేయాలని, క్షయరహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపు నిచ్చారు. డిఐఒ డాక్టరు సెలీనా కుమారి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను అన్ని దశల్లో శీతలీకరణ ప్రక్రియలో భద్రపరచాలన్నారు. సకాలంలో వాటిని వినియోగించి ప్రభుత్వ నిర్దిష్ట లక్ష్యాలను అధిగమించాలన్నారు. వ్యాధినిరోధక వ్యాక్సినేషన్ కార్యక్రమంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎస్ఎంఒ డాక్టరు ఎస్.మోనికా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ మరణాంతక వ్యాధులు వాటి లక్షణాలు, వ్యాప్తి, వ్యాధి నిరోధకటీకాల ద్వారా నివారణ తదితర అంశాలపై వివరించారు. డాక్టర్లు పిఎల్ దయాకర్, ఎం.ప్రియంవద, బ్రిజిత, పలువురు ప్రోగ్రాం ఆఫీసర్లు , డెమో బి.శ్రీనివాసరావు, కె.సహన, తదితరులున్నారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి టోల్ ప్లాజా వద్ద ఆత్మకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి రాములు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. పలు వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. వాహనదారులు సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, అధికలోడుతో వెళ్తున్న పలు వాహనాలు జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఎఎస్ఐ రాజా, సిబ్బంది ఉన్నారు.

కులగణన సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపడుతున్న కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో బిట్-2 సచివాలయం సిబ్బంది చేపడుతున్న కులగణన సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని పూర్తి వివరాలను సిబ్బంది తప్పనిసరిగా నమోదు చేస్తూ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ సర్వేకు మండలంలోని అన్ని గ్రామాల కుటుంబ యజమానులు సిబ్బంది చేపడుతున్న సర్వేకు సహరించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కందుకూరు : రక్త దానానికి ఏవీ అవసరం లేదు. కేవలం ప్రాణాపాయంలోని వారిని కాపాడాలని తపన తప్ప అని నిరూపించాడు నరేషే అనే యువకుడు. ఒంగోలు రిమ్స్‌లో ఒక గర్భిణీకి నొప్పులు రాగా అత్యవసరంగా ఆమెకు రక్తం ఇచ్చే దాత కావాలని వైద్యులు కోరారు. దీనికి తక్షణమే స్పందించిన కందుకూరుకి చెందిన నరేష్ తన సొంత ఖర్చులతో వెంటనే ఒంగోలు కు వెళ్లి రక్త దానం చేశారు. నరేష్ రోజువారీ జీతంతో పనిచేసే చిరుద్యోగి. వీరి తండ్రి రాజా కూడా ఒక షామియానా షాప్ లో పనిచేస్తుంటారు. నరేష్ తాత మువ్వల భూషయ్య రాజకీయ పార్టీ నాయకుడు. భూషయ్య దగ్గర నుండి వారి కుటుంబంలో అందరూ రక్త దాతలు , నేత్ర దాతలు అవడం విశేషం.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి-నెల్లూరు : ఆరోగ్యమే మహాభాగ్యం నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని యామిని న్యూరో కేర్ హాస్పిటల్ డాక్టరు యామిని, డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేక్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మానవ శరీరం ఒక యంత్రం లాంటిదని దానిని ప్రతిరోజూ పరిరక్షించుకోకపోతే వ్యాధులకు మూల కారణమవుతుందన్నారు. హడావుడి ఒత్తిడి, చెడు అలవాటులకు దగ్గర చేతులారా అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవటం పరిపాటిగా మారిందన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే గోల్డెన్ అవర్స్‌లో ఇంజక్షన్ ద్వారా పక్షవాతం రాకుండా నివారంచ వచ్చని తెలిపారు, కెనడా దేశానికి చెందిన అత్యాధునికమైన పరికరం అందు బాటులోకి తీసుకొస్తామని, ఈ పరికరం ద్వారా మరో ఐదు సంవత్సరాల కాలంలో ఈ వ్యాధికి గురయ్యే వారిని గుర్తించొచ్చన్నారు. ఈ ఆధునిక పరికరం వచ్చిన వెంటనే జర్నలిస్టులు అందరికీ ఉచితంగా వైద్యసేవ అందిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు

మాట్లాడుతున్న గడ్డం అంకయ్య

మండలంలోని కృష్ణపట్నం పోర్టు పామాయిల్ ఫ్యాక్టరీలు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశాన్ని షేక్ మస్తాన్‌షా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడారు. మండలంలోని కృష్ణపట్నం పోర్టు పామాయిల్ ఫ్యాక్టరీలు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల కేన్సర్, ఊపిరితిత్తులు, నెమ్ము, గర్భకోశ వ్యాధులు కంటిచూపు మందగించ డం చర్మ వ్యాధులు వంటి వాటితో అల్లాడిపోతు న్నారని తెలిపారు. మండల ప్రజానీకాన్ని అన్ని విధాల ఆదుకోవాలని, గతంలో పెండింగ్‌లోని నాన్ ఫిషర్మన్ ప్యాకేజీ రూ.43,050 ఇవ్వాల్సి ఉంటే రూ.25వేలు మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలిన రూ.18, 050 ఇంతవరకు ఇవ్వలేదన్నారు. గతంలో ఎన్నికల హామీగా ప్రకటించిన రూ.43, 050 లను రాబోవు 2024 ఎన్నికల హామీగా మండల ప్రజానీకానికి ప్రకటించాలని అది . కార ప్రతిపక్ష పార్టీలకు సిపిఎం విజ్ఞప్తి చేసిందన్నారు. 26-5-2017లో మండలం లోని పరిశ్రమల యాజమాన్యాల వారు సిఎస్ఆర్ నిధుల ద్వారా కాలుష్యానికి గురైన మండల ప్రజానీకానికి కుటుంబానికి 25కేజీల బియ్యం, రూ.3వేలు చొప్పున నగదును పొల్యూటర్స్ పే ప్రకారం చెల్లిస్తామని గతంలో హామీ ఇచ్చారన్నారు. తహశీల్దార్ సమక్షంలో ఆర్‌సిబిఎల్ (ఎ) /825 /2018 తేదీ 22-12 -2018న ఆర్డర్‌ను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్డర్ ప్రకారం ప్రతినెలా కుటుంబానికి 25కిలోల బియ్యం రూ.3వేలు నగదు పెండింగ్లో ఉన్న నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజీ రూ.18050లను వెంటనే చెల్లించాలని తేదీ 4-9-2023న మండల ప్రజానీకం పెద్ద ఎత్తున ముత్తుకూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించామన్నారు. ఇప్పటికైనా అధికారంలోని వైసిపి ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ఇద్దరు ఈ మండలంలోని పేద ప్రజానీకానికి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వెంటనే మీరు ఎన్నికల హామీగా రాబోవు రోజుల్లో వెంటనే ప్యాకేజీని ప్రకటించాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసిందని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు నక్క రాధయ్య, మండల కమిటీ సభ్యులు పట్టపు జయ రామయ్య, కె.నాగరాజు, ఎన్.శ్యాం ప్రసాద్, చేవూరు మల్లికార్జున, దుంపల ఏడు కొండలు, ఎస్‌కె సలాం, తదితరులున్నారు.

పోలంరెడ్డివి అవగాహన లేని వ్యాఖ్యలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నల్లపరెడ్డి

ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ అవగాహన లేకుండా పొలంరెడ్డి దినేష్ రెడ్డి మాట్లాడడం సరికాదని ఎపిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రువారం ఇందుకూరుపేట మండలంలోనీ ముదిరవర్తిపాలెం కాజ్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నలపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మట్లడుతూ కేంద్ర, రాష్ట్ర నిధులకు తేడతెలినవారు ఎంఎల్ఎ అభ్యర్థులు కావడం కోవూరు ప్రజల దురదృష్టకరమన్నారు. అనంతరం ఎపిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ యాదవ్ మాట్లాడుతూ కోవూరు టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. ప్రసన్న కుమార్ రెడ్డి శంకుస్థాపనలు చేసిన ప్రతీ పనిని పూర్తి చేసామన్నారు. ఉదాహరణకు రావూరూ రోడ్డు, పన్నూరు రోడ్డు, పెన్నాపోర్లు కట్టలు వంటి ఎన్నో పనులను మండలంలో చేశామన్నారు. అసలు శిలాఫలకాలే లేకుండా మైపాడు టూ నెల్లూరు రోడ్డు, గంగపట్నం చెరువు, ఎన్నో కాలువల పూడిక తీతలు వంటి అభివృద్ధి పనులు చేసామన్నారు. మైపాడు చెరువు నరసాపురం, సోమరాజు పల్లి, కోరుటూరు గ్రామాలకు సంబంధించిన శిలాఫలకం నరసాపురంలో చెరువు పక్కనే వేశామని అది కూడా అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. అలాగే మైపాడు చెరువు పనులకు సంబందించి లోటస్ కాంపెనీ వారు 2020లో టెండర్ వేసి 2021 వరకు రూ.60 లక్షల పనులు చేశారని, అనంతరం కరోనా రావడంతో పనులు ఆగిపోయాయాని, దానిని కూడా ప్రజలను పక్కదారి పంట్టించేందుకు తమ నాయకులపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, గుణపాటి సురేష్ రెడ్డి, నల్లపరెడ్డి రజితరెడ్డి, జెడ్‌పి వైస్‌చెర్మన్ శ్రీహరికోట జయలక్ష్మీ, డిసిఎంఎస్ చైర్మన్ వీరిచలపతి, అధికారులు, తదితరులున్నారు.

పేదల ఆరోగ్యంపై సిఎం ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-సీతారామపురం : రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బసినేనిపల్లి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సురక్షలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, మందుల పంపిణీ తదితర క్యాంపులను పరిశీలించి రోగుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య ధృపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీని రూ.25లక్షల వరకు కుటుంబానికి పెంచారని దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, ఎంపిడిఒ భార్గవి, వైద్యాధికారిణి స్వప్న, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-కావలి : బుడంగుంటలో కామాక్షి తాయి మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలనను శుక్రవారం చేపట్టారు. కావలి పట్టణ పరిధిలోనిబుడంగుంట క్రాస్ వద్ద నిర్మాణంలో ఉన్న కామాక్షమ్మ ఆలయం అంచనాలను పరిశీలించారు. దేవాదాయ శాఖకు చెందిన సహాయం స్థపతి సురేంద్ర, ఎ.ఇ మురళి మోహన్‌లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో నిర్మాణం అయిన ప్రాంతాన్ని కొలతలు తీసుకున్నారు. భవిష్యత్తు నిర్మాణపు అంచనాలను నమోదు చేసుకున్నారు. కామాక్షితాయి సమేతా మల్లికార్జున స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ద్రోణాదుల వెంకట క్రిష్ణారెడ్డి, లక్ష్మి సంపూర్ణమ్మలతో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎంఎల్ఎ సహకారంతో ఆలయ నిర్మాణం కోసం దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎండోమెంట్ కమిషనర్ జవహర్‌లను కలిసి ఆలయ నిర్మాణానికి సహకారం కోరగా, వారు సహృదయంతో సహకరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో స్థపతి, ఎ.ఇ.లు విచ్చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, వారిని శాలువాతో సత్కరించారు.

'టివిఎస్' ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలోని సర్వాయిపాలెం హైస్కూల్ నందు టివిఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ బృందం సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం, విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం టివిఎస్ ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు, సర్వాయపాలెం హైస్కూల్‌లోని ఉపాధ్యాయులు సిహెచ్.వెంకటేశ్వర్లు, పివికె భాస్కర్, వై.సుధాకర్, ఎం.సమీర్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం పాటూరు రమణ మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా రక్తదానం గొప్పదని రక్తదానం ప్రాణ దానంతో సమానమని ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన రెడ్‌క్రాస్ బృందానికి అభినందనలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ బృంద సభ్యులైన కె.హరినారపర రెడ్డి, డి.వి.పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వర్లు, అనిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

నినాదాలు చేస్తున్న దళిత నాయకుడు ఎస్.మల్లి

ప్రజాశక్తి-కావలి : ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అసైన్డ్‌మెంట్ చైర్మన్ అయ్యి ఉండి కూడా భూమి లేని పేదలకు ప్రభుత్వ భూమిని పంచేందుకు ప్రయత్నం చేయక పోవడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లేనని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తప్పు పట్టారు. శుక్రవారం పట్టణంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్‌డిఒ శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మొత్తం ఎన్నికల సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో భూ పంపిణీ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మిగులు భూమి, గ్రామనత్తం భూమి, సాగుబడి చేసుకొంటున్న భూమి ఒక్కొక్క మండలంలో 1500 ఎకరాలకు పైగా పంపిణీ జరుగుతూ ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో భూ పంపిణీ జరుగుతుందని తెలిపారు. కావలి నియోజవర్గంలో భూ పంపిణీని ఎంఎల్ఎ చేపట్టలేదని తెలిపారు. కావలి ఎంఎల్ఎ 3వేల ఎకరాలలో గ్రావెల్ ఎత్తుకొని, అమ్ముకోవ డానికి రియల్ ఎస్టేట్ వాళ్లని ప్రోత్సహిం చారని ఆరోపించారు. రుద్రకోట గ్రామంలో 515 సర్వే నెంబర్‌లో 1000 ఎకరాలు పైగా తవ్వుకోవడానికి ప్రోత్సహించారని తెలిపారు. పాతూరు, కావలి పట్టణానికి మొత్తం రియల్‌ఎస్టేట్ వారికి గ్రావెల్ అమ్ముకోవడానికి సహకరించారని ఆరోపించారు. తిప్ప దగ్గర 100 ఎకరాల వరకు గ్రావెల్ తవ్వుకునే వారిని ప్రోత్సహిస్తున్నారని, ఇప్పటికి గ్రావెల్ తవ్వుతున్నారని తెలిపారు. గిరిజన పాఠశాల స్థలాన్ని కూడా తవ్వుకున్నారని తెలిపారు. ఆములూరు దగ్గర 300 ఎకరాలు, 363 సర్వే నెంబర్‌లో కెకెగుంట దగ్గర 200ఎకరాలు, దామవరం విమానాశ్రయ భూముల్లో 50 ఎకరాలు, కడనూతల చెరువు పక్కన గ్రావెల్ తవ్వుకొన్నారని ఆరోపించారు. 6వేలమంది పేదల నోళ్లు కొట్టినారని ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా సమయం 20రోజులు ఉన్నందున, కావలి డివిజన్‌లో భూ పంపిణీ చేపట్టాలని పేదలపైన దయ ఉంటే ఎంఎల్ఎ, అసైన్డ్‌మెంట్ చైర్మన్‌గా చర్యలు చేపట్టాలని కోరారు. తన అనుచరులకు గ్రావెల్ మాఫియాకు సహకరించకుండా ఇప్పటికైనా పేదల పై కనికరం చూపాలని కోరారు. జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్య వతమ్మ, ఎంఆర్‌పిఎస్ నాయకులు జరుగుమల్లి విజయ రత్నం, నారుబోయిన లక్ష్మినర్సు, చౌటూరి వెంకట రత్నం, పోట్లూరు విజయమ్మ, తదితరులున్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం

అనంతసాగరం మండలం 1వ గ్రామ సచివాలయంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వారు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ మాధవి మాట్లాడుతూ వరిలో కాంప్లెక్స్ ఎరువులతో పాటుగా వాడడం వల్ల నేలలో మోతాదుకు మించి భాస్వరం ఉండడం వల్ల మొక్కకు కావాల్సిన సూక్ష్మపోషకాలు నేలలో ఉన్నప్పటికీ అందుబాటులోకి రావన్నారు. అలాగే అన్ని రకాల పోషకాలు సమపాళ్లలో వాడినప్పుడు మొక్కల్లో పెరుగుదల ఉండడంతో తెగుళ్ల పురుగులు తక్కువగా ఆశిస్తాయన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారివాసు మాట్లాడుతూ నాటే దశ నుంచి కోత దశ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. ముఖ్యంగా ముదురు నారు నాటేటప్పుడు ఒక కుదురుకు ఎక్కువ సంఖ్యలో మొక్కలు పెట్టుకొని ఎక్కువ లోతు లేకుండా నాటాలన్నారు. నాటిన దశ నుంచి 45 రోజుల లోపల అన్ని రకాల ఎరువులు వేయడం పూర్తి చేయాలని, ఆ తర్వాత వేయడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం పంటల ఉత్పత్తి అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వరిలో అజో స్పైరిలం, పిఎస్‌బి, కెఆర్‌బి జీవన ఎరువులను వాడడం వల్ల నేలలో వేసిన ఎరువులు మొక్కకు అందుబాటు రూపంలోకి త్వరగా వస్తాయని, పైరు మొత్తం మీద వేసే ఎరువులలో 25 శాతం తగ్గించి వాడుకునేలా చేస్తాయన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు నివారణకు నత్రజని ఎరువులు అధికంగా వాడడం ఒక కారణమని, కాబట్టి నత్రజని ఎరువులు సమపాళ్లలో వాడాలని, పైరులో ఆరుతడులు లేకుండా నీరు ఉంచుకోవాలని ఆకుమీద అగ్గి తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ఎకరానికి 120 గ్రాములు ట్రై సైక్లోజోల్ పిచికారి చేయాలని, మెడ విరుపు రాకుండా ఐసో ప్రోతయోలిన్ ఎకరానికి 330 ఎం.ఎల్. ముందు జాగ్రత్త చర్యగా పిచికారి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాపూరు బాలకొండారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, బట్రెడ్డి కృష్ణారెడ్డి అనంతసాగరం గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్, షేక్ మై మున్నీసా, ఖాదర్ రెడ్డి, రత్నారెడ్డి, నర్సారెడ్డి, రఘురాం రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని రంగ నాయుడుపల్లి సమీపాన ఉన్న రామయ్య స్వామి ఆశ్రమంలోని పరమశివుని దేవాలయంలో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి రామయ్య స్వామి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మేకపాటి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో వైసిపి జెండా ఎగిరి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి అధికారం చేపట్టాలని అదేవిధంగా ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్ఎగా తనను ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధిక మెజారిటీతో ప్రజల ఆశీస్సులతో గెలవాలని దేవుని ప్రార్థించామన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-సీతారామపురం

సీతా రామ పురానికి చెందిన ఆది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆది నారాయణరావు శుక్రవారం మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ బొల్లినేని రామారావు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. వింజమూరు పట్టణంలో టిడిపి నిర్వహిస్తున్న ప్రజాదీవెన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఆదినారాయణరావు మాట్లాడుతూ సీతారామపురం మండలంలో టిడిపి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికలలో బొల్లినేని రామారావును శాసనసభ్యుడిగా భారీ మెజారిటీతో గెలిపించు కుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఆయనతోపాటు సోంపల్లి యూత్ ప్రెసిడెంట్ గొల్లపల్లి సుధాకర్, వినోద్, సురేష్, అఖిల్, సురేష్, మల్లికార్జున తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ పరిశీలకులు వికాస్‌హరికృష్ణ పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో పిచ్చికుక్కల స్వైర విహారం ఎక్కువైంది. గ్రామంలో కుక్కల సంఖ్య ఎక్కువ కావడంతో పిచ్చి కుక్కల సంఖ్య మరింత పెరిగి ఇంకా ఎంతమందిపై దాడి చేస్తాయోనని గ్రామ స్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు గేదెలపై దాడి చేయగా, శుక్రవారం ఓ చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో చిన్నారికి గాయాల య్యాయి. పాలకులు అధికారులు స్పందించి కుక్క లను పట్టుకునేందుకు చర్యలు చేపట్టి పిచ్చి కుక్కల భారీ నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ కార్మికులకు మొండిచేయి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి -నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలను వ్యవసాయ కార్మికులను విస్మరించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమ రాజు, మంగళ పుల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ధనవంతులకు బడా పారిశ్రామికవేత్తలకు లాభ సాటిగా ఉపయోగపడే విధంగా ఉందని దేశానికి ఎంత అన్నం పెడుతున్న వ్యవసాయ రంగానికి రైతాంగానికి వ్యవసాయ కూలీలకు కార్మిక రంగా నికి నామమాత్రంగా నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నదన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి వ్యవసాయ కార్మికులకు పేదలకు జీవనోపాధి కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో కేవలం రూ.87 వేల కోట్ల కేటాయించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పనుల్లో కూలీలకు రూ.15 వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నవని అలాగే మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 60 వేల కోట్లు పోతే మిగిలేది రూ.12 కోట్లే అన్నారు. ఈ రూ.12 కోట్లతో ఉపాధి హామీ పనులు కూలీలకు ఏమి కల్పిస్తారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని డిమాండ్ చేశారు. వాస్తవంగా ఉపాధి హామీ చట్టం ద్వారా దేశంలో పేదలందరికీ ఉపాధి పనులు కల్పించాలంటే రూ.2 లక్షల కోట్లు అవసరం ఉంటే కేవలం రూ.87 వేల కోట్లు కేటాయించడం బాధాకరమన్నారు.ఉపాధి హామీ చట్టానికి ఈ రకంగా నిధులు కేటాయింపులో చిన్న చూపు చూడడం మంచిది కాదని, వెంటనే ఉపాధి హామీకి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

టిడిపి కండువాలు కప్పుతున్న పోలంరెడ్డి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని కానీ శిలాపలకాలకే పరిమితం అవుతున్న దృష్ట్యా వైసిపిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. పడుగుపాడు పంచాయతీలో 90వరోజు ప్రతి అడుగు కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడారు. అనంతరం గంగవరపు రవిచంద్ర నాయుడు ఆధ్వర్యంలో దినేష్ రెడ్డి సమక్షంలో 40మంది టిడిపిలో చేరారు. వారికి అండగా ఉంటానని దినేష్ రెడ్డి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా టిడిపిలో చేరిన పఠాన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఓపికతో ఉన్నానని, భవిష్యత్తు కోసం టిడిపిలోకి చేరామన్నారు. కార్యక్రమంలో చైతన్య మండలం అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు నాటకర వెంకట్, చెంబెటి పెంచలయ్య, తిరుమూరు అశోక్ రెడ్డి, సయ్యద్ మసూద్, అమర్, రమేష్, బెల్లం కొండ శ్రీహరి, సాదిక్, పిరోజ్, యాకసిరి వెంకటరమణమ్మ, గుంజి మస్తాన్, చౌటూరు రవి కుమార చెన్న కృష్ణరెడ్డి జహంగీర్, నాగరాజు పాలూరు వెంకటేశ్వర్లు, షేక్ జమీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి ఓదార్పు..

నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : టిడిపి అధినేత మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుపై కేసు నమోదు చేయడంతో మనోవేదనకు గురై మృతి చెందిన కముజుల ఆంజనేయ రెడ్డి కుటుంబాన్ని నారా భువనేశ్వరి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. శుక్రవారం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరీ నిజం గెలవాలి యాత్రలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని అల్లిపురంలోని గ్రామంలోని తెలుగుదేశం కార్యకర్త కముజుల ఆంజనేయరెడ్డి ఇంటిని నారా భువనేశ్వరీ పరామర్శించారు. ఆంజనేయులు రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.3లక్షలు ఆర్థికసాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎంఎల్ఎ కొమ్మి లక్ష్మయ్య నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజా రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి చెరుకూరు పద్మావతమ్మ, టిడిపి అధికార ప్రతినిధి వెంకట సుబ్బారాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు గౌస్‌బాషా, మాదాల శ్రీనివాస్ నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, ఎస్ఆర్‌ఐ వీరాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ

ప్రజాశక్తి-కావలి : దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థ "సక్షం" ఆధ్వర్యంలో పి వెంకటలక్ష్మి అనే దివ్యాంగురాలికి శుక్రవారం మూడుచక్రాలసైకిల్ అందజేశారు. పాతవూరు కృష్ణమందిరం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రియల్టర్, వితరణశీలి జెనిగళ్ల మహేంద్ర చేతుల మీదుగా లబ్ధిదారునికి అందించారు. సక్షం ప్రతినిధులు కె.మాధవరెడ్డి, నాగమణి, మంగళగిరి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ పొనుగోటి అనురాధ, వైసిపి నాయకులు కలగయ్య పాల్గొన్నారు.

In the Court of the I Addl. District Judge : Nellore

I.A.No. 61 / 2023
O.S.No. 18 / 2022

1. Palavalli Padmavathi @ Padmavathamma
2. Palavalli Mahesh Reddy
3. Palavalli Vamsi Krishna Reddy
- Petitioners / Defendants
Vs
Vedururi Mohan Rao @ Mohana Rao
- Respondent / Plaintiff

Notice to Respondent / Plaintiff

Vedururi Mohan Rao @ Mohana Rao, S/o Late **Ramaiah,** residing at Gopannapalem Village, Beside Ramula Vari Temple, Jaladanki Mandal, SPSR Nellore District.

పై నెంబరున పిటిషనర్లు/ ప్రతివాదులు ఎక్స్‌పార్టీ డిక్రీని సెటసైడ్ చేయమని పిటిషన్ వేయడంలో ఆలస్యమైనందున, ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో సెక్షన్ 5 ఆఫ్ లిమిటేషన్ యాక్ట్ ప్రకారం మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే27-02-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

షేక్.అన్వర్ బాషా, బి.కాం., ఎల్.ఎల్.బి.,
పిటిషనర్లు / ప్రతివాదులు తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the I Addl. District Judge : Nellore

I.A.No. 62 / 2023
O.S.No. 18 / 2022

1. Palavalli Padmavathi @ Padmavathamma
2. Palavalli Mahesh Reddy
3. Palavalli Vamsi Krishna Reddy
- Petitioners / Defendants
Vs
Vedururi Mohan Rao @ Mohana Rao
- Respondent / Plaintiff

Notice to Respondent / Plaintiff

Vedururi Mohan Rao @ Mohana Rao, S/o Late **Ramaiah,** residing at Gopannapalem Village, Beside Ramula Vari Temple, Jaladanki Mandal, SPSR Nellore District.

పై నెంబరున పిటిషనర్లు/ ప్రతివాదులు తే09-09-2022దిన కోర్టు వారు పాస్ చేసిన ఎక్స్‌పార్టీ డిక్రీని సెటసైడ్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఆర్డర్ 9 రూల్ 13 ఆఫ్ సిపిసి ప్రకారం మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే27-02-2024ది** కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

షేక్.అన్వర్ బాషా, బి.కాం., ఎల్.ఎల్.బి.,
పిటిషనర్లు / ప్రతివాదులు తరపు అడ్వకేట్, నెల్లూరు.

డాక్యుమెంటు పోయినది

ఇస్లావత్ బ్రహ్మనాయక్, తండ్రి **ఇస్లావత్ భీమా నాయక్,** నెల్లూరు జిల్లా, నెల్లూరు సిటీ, పోలీస్ క్వార్టర్స్, దర్గామిట్ట, అను నేను నా ఒరిజినల్ రిజిష్టరు **డాక్యుమెంటు నెం. 412/2018** కనుపూరు బిట్-1 గ్రామంలోని **సర్వే నెం.754/1 రులో** ప్లాట్ **నెం.3** ప్లాట్లుకు సంబంధించి అందులోని **విస్తీర్ణం 412 చదరపు గజముల** స్థలమునకు కలిగిన ఒరిజినల్ రిజిష్టరు **డాక్యుమెంటు నెం.412/2018 తేది: 10-04-2023** న పోలీస్ స్టేషన్ నుండి కోవూరుకు తీసుకొని మోటారు బైక్‌లో పోవుచుండగా మార్గమధ్యలో జారిపడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

ఇస్లావత్ బ్రహ్మనాయక్,
తండ్రి **ఇస్లావత్ భీమా నాయక్,**
దర్గామిట్ట, పోలీస్ క్వార్టర్స్, నెల్లూరు జిల్లా,
నెల్లూరు సిటీ. సెల్: **89854 37718**

CHANGE OF NAME

I, YELCHURI SUBHASHINI (Before marriage) wife of KOMMURU KIRAN KUMAR, resident of D.No.11-31-89, Brundavanam Housing Colony, Kavali Town, SPSR Nellore Dist. A.P. hereby declare that I have changed my name as

KOMMURU KEERTHANA
(after marriage)
hereafter call all purpose in future.

సర్టిఫికేట్ ఫైల్ పోయినది

షేక్.అల్తాఫ్, తండ్రి **షేక్.అజీజుర్ రెహమాన్,** ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం పొదలకూరు రోడ్డు నుండి **KVR** పెట్రోల్ బంక్‌కి **తే28-12-2023దిన** బైక్‌లో ప్రయాణిస్తున్నప్పుడు క్రింద పేర్కొన్న సర్టిఫికేట్ ఫైల్‌ను పోగొట్టుకున్నాను. **సర్టిఫికెట్లు:** 1. 10వ ఒరిజినల్ మార్కుల జాబితా, Roll No. 0993200. 2.ఇంటర్ ఒరిజినల్ మార్కుల జాబితా, Reg.No : 5114692. 3. B.sc M.P.Cs డిగ్రీ ఒరిజినల్ ప్రొవిజనల్ మరియు కాన్వొకేషన్ సర్టిఫికెట్లు Reg.No : 301053775. 4. M.C.A పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఒరిజినల్ ప్రొవిజనల్ మరియు కాన్వొకేషన్ సర్టిఫికెట్లు Reg.No : 1205101. పోయినవి. ఈ సర్టిఫికేట్లు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

షేక్ అల్తాఫ్, తండ్రి **షేక్.అజీజుర్ రెహమాన్,**
డోర్ నెం.25-3-285, 2వ వీధి, లేక్వ్యూ కాలనీ,
పొదలకూరు రోడ్డు, నెల్లూరు నగరం-524004.
సెల్: **86677 34954**